తెలంగాణకు ఇంటి పార్టీయే రక్ష

టంకశాల అశోక్

తెలంగాణ ప్రజలు ఈ రోజు ఓటింగ్‌కు వెళ్లేముందు ఆలోచించాల్సిన ముఖ్యమైన విషయం ఒకటున్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుతున్నది ప్రధానంగా ప్రాంతీయ పార్టీలే తప్ప జాతీయ పార్టీలు కాదు. దేశానికి జాతీయ పార్టీలు అక్కరలేదని కాదు. కానీ, వాటి దృష్టి జాతీయ స్థాయి రాజకీయ శక్తులు, ఆర్థిక శక్తుల ప్రయోజనాలపై ఉన్నట్టు వివిధ ప్రాంతాల అభివృద్ధిపై గాని, అక్కడి రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక శక్తుల బాగోగులపై గాని ఉండదు. అందువల్లనే కొన్ని ప్రాంతాలను ధనిక ప్రాంతాలుగా, కొన్నింటిని అంతర్గత వలసలుగా మార్చుతారు తప్ప సమతులమైన అభివృద్ధి కోసం ప్రయత్నించరు.

ఇది ఊహాజనితం కాదని, వాస్తవమని చరిత్ర చెప్తున్నది. భారతదేశంలోనే కాదు, ప్రపంచమంతటా కూడా. ఇంకా చెప్పాలంటే, క్రీస్తుపూర్వకాలంలో పెద్ద రాజ్యాలన్నవి ఏర్పడినప్పటి నుంచి ఉన్న పరిస్థితి ఇది. అందువల్లనే ప్రాంతీయ శక్తుల ప్రతిఘటనతో ఫెడరలిస్టు వ్యవస్థలు ప్రపంచవ్యాప్తంగా క్రీస్తుపూర్వం నుంచే ఏర్పడ్డాయి. భారతదేశ వైవిధ్యతల దృష్ట్యా మన దేశ రాజ్యాంగంలోనూ ఫెడరలిస్టు లక్షణాలను రాజ్యాంగ నిర్మాతలు చేర్చారు. ఆ ఏర్పాట్లకు జాతీయ పార్టీలు భంగం కలిగించినందువల్లనే మొదట పంజాబ్, కశ్మీర్, తమిళనాడులకు పరిమితమై ఉన్న ప్రాంతీయ పార్టీలు 1980ల నుంచి మొదలుకొని అత్యధిక రాష్ట్రాల్లో ఆవిర్భవించాయి. అప్పుడే రాష్ట్రాల వివిధ ప్రయోజనాల పరిరక్షణకు, అభివృద్ధికి అవకాశం లభించింది.

ఇది సహించలేని సెంట్రలిస్టు పార్టీలు ప్రాంతీయ శక్తులను దెబ్బతీసేందుకు ప్రాంతీయ వనరులను తమ ధనిక మిత్రుల కోసం చేజిక్కించుకునేందుకు ప్రయత్నించాయి. రాష్ట్రాలకు రాజ్యాంగంలో గల ఫెడరల్ అధికారాలను కుదించేందుకు రాజ్యాంగాన్ని, చట్టాలను సవరిస్తూ, ఇతర చర్యలు తీసుకుంటూ, పలు విధాలైన ఎత్తుగడలు వేస్తూ వస్తున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీలకు ఎంతమాత్రం తేడా లేదు. ఈ అంశంపై అనేక అధ్యయనాలు ఉన్నాయి.

జాతీయ పార్టీల పేరిట ఈ విధంగా ప్రాంతీయ ప్రయోజనాలకు భంగకరంగా వ్యవహరించే సెంట్రలిస్టు శక్తులను అడ్డుకోవటం తెలంగాణ ప్రజలతో పాటు మొత్తం దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు ఒక తప్పనిసరి అవసరం. అంతేకాదు, ప్రపంచంలోని మరే దేశంలోనూ లేనంతటి వైవిధ్యత గల మన దేశ ఐక్యతా పరిరక్షణకు, పటిష్టతకు కూడా ఇది అవసరం. ఇటువంటి అవసరాలను స్వాతంత్ర్యోద్యమ నాయకత్వం గుర్తించినందువల్లనే వారు దేశానికి అందుకనుగుణమైన రాజ్యాంగాన్ని రూపొందించారు.

తెలుగు సీమకు సంబంధించి ఇటువంటి నేపథ్యాలు, కాంగ్రెస్ వ్యవహారశైలి, అసమర్థతల పర్యవసానంగానే 1980ల నుంచి ఇక్కడ ఫెడరలిస్టు పార్టీల దశ మొదలైంది. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఆ దశ కొనసాగుతున్నది. వాస్తవానికి తెలంగాణ రాష్ట్ర పోరాటం కూడా సెంట్రలిస్టు కాంగ్రెస్ దశాబ్దాల పాటు ఈ ప్రాంతానికి చేసిన అన్యాయాలపై సాగించిన ఫెడరలిస్టు ప్రతిఘటనా ఉద్యమమే. ఆ విధంగా ఈ తెలుగు సీమ ఫెడరల్ ధోరణులకు 40 ఏండ్లకు చరిత్ర ఉంది. అది ఇప్పటికీ బలంగా వర్ధిల్లుతున్నది. దానిని తుద ముట్టించటం కాంగ్రెస్, బీజేపీలకు వల్ల కావడం లేదు. కాదు కూడా. ప్రాంతీయ పార్టీల మూలాలు ఇక్కడి నేలలో, ప్రజలలో, సంస్కృతిలో ఉండటం అందుకు కారణం.

ప్రాంతీయ ప్రయోజనాలన్నింటి కోసం స్థానికంగా కాని, జాతీయస్థాయిలో కాని కట్టుబడి నిలిచేది, గొంతెత్తేది, పాటుపడేది అంతిమంగా ప్రాంతీయ పార్టీలు, ప్రజల ఇంటి పార్టీలు మాత్రమే. ఈ క్రమానికి ఎప్పుడైనా కొద్ది ఒడుదొడుకులు ఎదురైనా, అంతిమంగా రక్షణలు కేవలం ప్రాంతీయ పార్టీలే. ఇది మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన గత 75 సంవత్సరాలుగా దేశమంతటి అనుభవం. అందువల్ల, ఈ రోజు పోలింగ్‌కు ముందు తెలంగాణ ఓటర్లు, తెలంగాణ ప్రజలు కూడా ఆలోచించాల్సిన విషయమిది.

ఆదిలాబాద్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పోలింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న సీతఃవో వికాస్‌రాజ్, గ్రేటర్ ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్

నేడే 'లోక్‌సభ' సమరం

- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఓటర్లు : 3.32 కోట్ల మంది
- పోలింగ్ కేంద్రాలు : 35,809
- బరిలో నిలిచిన అభ్యర్థులు : 525
- వీరిలో మహిళలు : 50 మంది
- కంటోన్మెంట్ అసెంబ్లీకి ఉప ఎన్నిక
- సాయంత్రం 6 దాకా ఓటింగ్
- జూన్ 4న లెక్కింపు

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా మాడల్ పోలింగ్ కేంద్రం

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో లోక్‌సభ సమరానికి సర్వం సిద్ధమైంది. 17 లోక్‌సభ స్థానాలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా 3.32 కోట్లమంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 35,809 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల బరిలో 525 మంది అభ్యర్థులుండగా వీరిలో 50 మంది మహిళలున్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ పరిధిలో 2.51లక్షల మంది ఓటర్ల కోసం 232 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకు,106 నియోజకవర్గాల్లో సా.6 గంటల వరకు పోలింగ్ జరగనుండగా ఆదివారం సాయంత్రానికే సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి అసలు ప్రక్రియను ప్రారంభిస్తారు.జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. పోలింగ్ సందర్భంగా రాష్ట్ర పోలీసులు, ఇతర రాష్ట్రాల పోలీసులు,కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలు మోహరించాయి.

ఓటేసిన 2,08,163 మంది

రాష్ట్రంలో ఇప్పటికే 2,08,163 మంది ఓటేశారు. కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్ వెసులుబాటుతో దివ్యాంగులు, 85 ఏండ్లు పైబడినవారు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1.88 లక్షల మంది ఉద్యోగులు సైతం ఓటేశారు. అన్ని విభాగాలకు చెందిన 2.94 లక్షల మంది పోలింగ్ విధులు నిర్వర్తిస్తున్నారు. అంతటా ఈవీఎంల ద్వారానే పోలింగ్ జరగనుంది. లోక్‌సభ స్థానాలకు తెలుపు బ్యాలెట్ పేపర్‌ను వినియోగిస్తున్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రాలు : 644

ఓటర్లను ఆకర్షించేందుకు ఎన్నికల సంఘం 644 మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఐదు మోడల్ కేంద్రాలు ఉంటాయి. స్థానికత ఉట్టిపడేలా వీటిని తీర్చిదిద్దారు. 597 కేంద్రాల్లో మహిళలు, నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 సెంటర్లలో దివ్యాంగులు, 119 పోలింగ్ కేంద్రాల్లో యువతీ యువకులే పూర్తిగా విధులు నిర్వర్తించనున్నారు.

పోలింగ్ శాతంపై ఆందోళన

పార్లమెంట్ ఎన్నికలపై ఓటర్లలో అనాసక్తి కారణంగా పోలింగ్ శాతం తగ్గుతుందని అటు రాజకీయ పార్టీలు, ఇటు అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో ఇక్కడ అక్కడ రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారు ప్రస్తుతం అక్కడే ఓటు హక్కు వినియోగానికి ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్‌లో పనిచేసే బెంగాల్, ఒడిశా, బీహార్, యూపీ రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ప్రైవేట్ ఉద్యోగులు కూడా సొంత ఊర్లకు పయనమయ్యారు. ఈ ప్రభావం హైదరాబాద్‌లో ఓటింగ్ శాతంపై పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2019 లో దేశంలో అతి తక్కువ ఓటింగ్ శాతం నమోదైన నియోజకవర్గాలుగా జీహెచ్ఎంసీ పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల జాతీయ స్థాయి టాప్ 50లో నిలిచాయి.

ఎండాకాలం ఏర్పాట్లు

ఎండాకాలం కావడంతో పోలింగ్ కోసం ఈసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కుర్చీలు, టెంట్లు, షామియానాలు, ఫ్యాన్లను అందుబాటులో ఉంచింది. సాయంత్రం 6 వరకు క్యూలో నిలుచున్న వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాత్రిపూట ఇబ్బంది పడకుండా లైటింగ్ సౌకర్యం కల్పించింది. వృద్ధులు, దివ్యాంగులకు సేవలందించేందుకు వలంటీర్లను నియమించింది.

ఓటెక్కడుందో తెలుసుకోవాలంటే!

అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారో అదే కేంద్రంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా ఈసీ ఏర్పాట్లు చేసింది. పోలింగ్ కేంద్రాలను మార్చలేదని ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఓటర్లు అయోమయానికి గురికాకుండా ఉండేందుకే కేంద్రాల్లో ఎలాంటి మార్పు చేయలేదని వివరించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రం, సీరియల్ నంబర్లను తెలుసుకునేందుకు ఈసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 1950 నంబర్‌కు ECI అని టైప్ చేసి ఓటరు కార్డు నంబర్‌ను ఎంటర్ చేసి ఎస్ఎంఎస్ పంపిస్తే పోలింగ్ కేంద్రం, సీరియల్ నంబర్ వెంటనే ఎస్ఎంఎస్ రూపంలో వస్తాయి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఓటరు హెల్ప్ లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సెర్చ్ యువర్ దగ్గర క్లిక్ చేసి మొబైల్ నంబర్ లేదా ఓటరు కార్డు నంబర్ లేదా ఇతర వివరాలు, లేదా బార్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా పోలింగ్ కేంద్రం, సీరియల్ నంబర్ తెలుస్తాయి.

రాష్ట్రంలో ఓటర్ల వివరాలు

పురుషులు	మహిళలు
1,65,13,014	1,67,00,574
ట్రాన్స్‌జెండర్స్	సర్వీసు ఓటర్లు
2,760	15,970
మొత్తం ఓటర్లు	3,32,32,318

గతంలో లోక్‌సభ పోలింగ్ శాతం

సంవత్సరం	పోలింగ్ శాతం
2004	69.95
2009	72.70
2014	68.77
2019	62.72

లోక్‌సభ నియోజకవర్గం	2019లో ఓటింగ్ శాతం
హైదరాబాద్	44.84
సికింద్రాబాద్	46.50
మల్కాజ్‌గిరి	49.63
చేవెళ్ల	53.25

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	ఓటర్లు
ఆదిలాబాద్	16,52,394
పెద్దపల్లి	15,97,892
కరీంనగర్	17,98,168
నిజామాబాద్	17,05,591
జహీరాబాద్	16,42,425
మెదక్	18,28,717
మల్కాజ్‌గిరి	37,80,453
సికింద్రాబాద్	21,20,550
హైదరాబాద్	22,17,305
చేవెళ్ల	29,39,057
మహబూబ్‌నగర్	16,83,709
నాగర్ కర్నూలు	17,39,310
నల్లగొండ	17,26,204
భువనగిరి	18,09,241
వరంగల్	18,25,492
మహబూబాబాద్	15,33,858
ఖమ్మం	16,31,952

విస్తీర్ణ పరంగా..	ఓటర్ల పరంగా..
అతి పెద్ద నియోజకవర్గం: ఆదిలాబాద్, 12,572 చదరపు కిలోమీటర్లు	అతిపెద్ద నియోజకవర్గం : మల్కాజ్‌గిరి, 37,80,453
అతి చిన్న నియోజకవర్గం: హైదరాబాద్, 78.12 చదరపు కిలోమీటర్లు	అతి చిన్న నియోజకవర్గం: మహబూబాబాద్, 15,33,858

ఎన్నికల విధుల్లో ప్రిన్సిపాల్ మృతి

బొడ్డుపల్లి నర్సింహ(ఫైల్)

జూబ్లీహిల్స్/వలిగొండ, మే 12: ఎన్నికల విధుల్లో పాల్గొన్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆదివారం గుండెపోటుతో మరణించారు. చంపాపేట్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి నర్సింహ (45) ఎన్నికల విధుల్లో భాగంగా నాంపల్లి నియోజకవర్గంలోని 151వ బూత్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వైద్య సహాయం అందించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన ఈయన 2021 మార్చి నుంచి ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, బాబు, పాప ఉన్నారు.

చికిత్స పొందుతున్న స్వామి, నీలయ్య

ఇద్దరు ఎన్నికల అధికారులకు తీవ్ర అస్వస్థత

ములుగు రూరల్, మే 12: ఎన్నికల విధులకు వచ్చిన ఇద్దరు అధికారులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. కామారెడ్డి జిల్లాలోని విద్యాశాఖలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న స్వామి, మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన నీలయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద చేపట్టిన ఎన్నికల సామగ్రి పంపిణీకి హాజరయ్యారు. స్వామి సొమ్మసిల్లిపోవడంతో అతని కంటికి,నోటికి తీవ్ర గాయాలయ్యాయి. నీలయ్య సైతం అస్వస్థతకు గురికాగా అధికారులు వీరిని ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

అనారోగ్యంతో ఉన్నా రమ్మన్నారు

వారం రోజులుగా తీవ్ర జ్వరం వస్తున్నదని నీలయ్య పేర్కొన్నారు.ఆరోగ్యం సరిగా లేదని అధికారులకు తెలిపినా ఏటూరునాగారంలో ఎన్నికల విధులు నిర్వర్తించాలని, లేదంటే సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరు కాగా కండ్లు తిరిగి కిందపడిపోయానని, వాంతులు అవుతున్నాయని తెలిపాడు. తనను ఇంటికి పంపించాలని ఆయన ఉన్నతాధికారులను వేడుకున్నారు.

సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దంపతులు ఓటు వేయనున్న పోలింగ్ కేంద్రం

నేడు చింతమడకకు గులాబీ దళపతి

ఓటు వేసేందుకు రానున్న కేసీఆర్ దంపతులు

సిద్దిపేట రూరల్, మే12: సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామానికి సోమవారం గులాబీ దళపతి కేసీఆర్ దంపతులు రానున్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓటు హక్కును వారు వినియోగించుకోనున్నారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చింతమడక గ్రామంలోని 13వ పోలింగ్ కేంద్రంలో కేసీఆర్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రామానికి సమీపంలోని హెలిప్యాడ్‌లో దిగి అక్కడి నుంచి కారులో వచ్చి ఓటు వేయనున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిసారి చింతమడకలో కేసీఆర్ దంపతులు తమ ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతున్నారు. కేసీఆర్ రానుండటంతో పోలింగ్ కేంద్రానికి భారీగా ఓటర్లు తరలివచ్చే అవకాశం ఉంది. కేసీఆర్ రాకకోసం గ్రామస్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నేడు వేతనంతో కూడిన సెలవు

హైదరాబాద్, మే 12(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం రాష్ట్రంలోని అన్ని ఫ్యాక్టరీలు, దుకాణాలు, ఎస్టాబ్లిష్‌మెంట్లు, ఇండస్ట్రీయల్ అండర్‌టేకింగ్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కొన్నిచోట్ల సెలవు ఇవ్వడంలేదని తమకు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి సంస్థలపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

13 సీట్లలో బీఆర్ఎస్ ముందంజ!

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల పోలింగ్ డేట్ దగ్గరయ్యేకొద్దీ అసలు విషయం నెమ్మదిగా తేటతెల్లమైంది' అని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇక, కేవలం 1.8 శాతం ఓట్ల తేడాతో బొటాబొటి మెజారిటీతో రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్.. అంతేవేగంగా ప్రజాదరణ కోల్పోయిందని అభిప్రాయపడుతున్నారు. 'నిజానికి రాష్ట్రంలో కాంగ్రెస్ పెద్దగా పెరిగిందీ లేదు. బీఆర్ఎస్ అంతగా తగ్గిందీ లేదు. ఆ రెండు పార్టీల మధ్య అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతం తేడానే ఇందుకు నిదర్శనం. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కొంతమంది నాయకులు కాంగ్రెస్ వైపు వెళ్లటం, సోషల్ మీడియాలో జరిగిన దుష్ప్రచారం బీఆర్ఎస్‌ను కొంత డిఫెన్స్‌లోకి నెట్టాయి. ఒక్కసారిగా కేసీఆర్ బయటకు రావటంతో ఆ పార్టీ తిరిగి బెబ్బులిలా విజృంభించింది. ఆత్మరక్షణ నుంచి ఎదురుదాడిలోకి వెళ్లిపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలవబోతుండటానికి కారణమిదే' అని ఓ రాజకీయ పరిశీలకుడు పేర్కొన్నారు. 'కొందరు పేరుగొప్ప నాయకులు బీఆర్ఎస్‌ను వీడి ఉండొచ్చు.. కానీ, బీఆర్ఎస్ క్యాడర్ ఎక్కడా చెక్కుచెదరలేదు. నేడు జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్ క్యాడరే ఆ పార్టీ వెన్నెముకగా, బలంగా నిలబడబోతున్నది' అని ఆయన విశ్లేషించారు. బీఆర్ఎస్ తన ఓటుబ్యాంకును యాజ్ ఇట్ ఈజ్‌గా నిలుపుకున్నదని, ఈ క్రెడిట్ కేసీఆర్‌కే దక్కుతుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ నాగేశ్వర్ తన విశ్లేషణలో పేర్కొన్న సంగతి తెలిసిందే. తెలంగాణలోని సామాన్య ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని మరో రాజకీయ విశ్లేషకుడు పెంటపాటి పుల్లారావు కూడా నిర్ద్వంద్వంగా పేర్కొన్నారు. ఇక ప్రముఖ ఆంగ్లదినపత్రిక ది స్టేట్స్‌మెన్ అయితే 'రీసెర్జెంట్ బీఆర్ఎస్.. స్పాయిల్డ్ ది చాన్సెస్ ఆఫ్ కాంగ్రెస్ అండ్ బీజేపీ' అనే పేరుతో ఒక విశ్లేషణనే ప్రచురించింది. ఐదు నెలల కాలంలోనే బీఆర్ఎస్ అనూహ్యంగా పుంజుకున్నదని, లోక్‌సభ సీట్లపై

కాంగ్రెస్, బీజేపీ పెట్టుకున్న ఆశలకు భారీగా గండి పడనున్నదని స్టేట్స్‌మన్ విశ్లేషించింది. దక్కన్ క్రానికల్, టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలు కూడా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ ప్రధాన పోటీదారు స్థాయికి వచ్చిందని విశ్లేషణలు ప్రచురించాయి. బీఆర్ఎస్ మెజారిటీ స్థానాల్లో గెలవబోతున్నదని చెప్పడానికి వివిధ వ్యక్తులు, సంస్థలు స్వతంత్రంగా నిర్వహించిన విశ్లేషణలే సాక్ష్యమని పరిశీలకులు భావిస్తున్నారు. 'బీఆర్ఎస్ గ్రాఫ్ భారీగా పెరిగిందని కాంగ్రెస్, బీజేపీకి చెందిన ముఖ్య నాయకులు కూడా సంకోచం లేకుండా అంగీకరిస్తున్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ పెరగడానికి బీజేపీయే కారణమని, ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఇటీవల పేర్కొనగా, రేవంత్ తప్పిదాల వల్లే బీఆర్ఎస్ తిరిగి లేచి కూర్చున్నది' అని బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. ఇద్దరు ముఖ్య నేతలు.. బీఆర్ఎస్ ముందంజలోకి వచ్చిందని చెప్పకనే చెప్పారు. నిజానికి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను వదులుకోవాలని అనుకోలేదు. స్థానిక కారణాలు, ఇతరత్ర సమస్యలతో వారు కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇద్దామని అనుకున్నారు. కానీ, అది తప్పుడు నిర్ణయమని, దానివల్ల తెలంగాణ, ప్రజలు.. తీవ్ర నష్టం ఎదుర్కొనబోతున్నారని 5 నెలల్లోనే గ్రహించారు. అందుకే ఓటర్లు ప్రస్తుతం కరెక్షన్ మోడ్ (దిద్దుబాటు చర్యలోకి)లోకి మళ్లారు' అని ఓ పాత్రికేయుడు అభిప్రాయపడ్డారు.

'గత 60 ఏండ్లుగా కాంగ్రెస్, 30 ఏండ్లుగా బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే రాష్ట్ర సమస్యల గురించి, ప్రజల సమస్యల గురించి పట్టించుకోవటం, పరిష్కరించటం మొదలైందని, ఈ ట్రాక్ ఒకసారి తప్పితే ఇక తెలంగాణ మళ్లీ వెనుకటి రోజులకు మళ్లిపోతుందని, ప్రజల్లో ఒక నిశ్చితాభిప్రాయం వచ్చింది. అందుకే రైతులు, మహిళలు, పింఛనుదారులు ఏకపక్షంగా బీఆర్ఎస్ వైపు తిరుగుతున్నారు. కరెంటు కోతలు, మంచినీళ్ల సమస్య ఓటర్ల మనోగతంలో పెను మార్పునకు కారణమయ్యాయి' అని ఆ పాత్రికేయుడు విశ్లేషించారు. 'కేవలం 16 రోజుల ప్రచారంలో కేసీఆర్ తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న దాదాపు 10 సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించేలా ఒత్తిడి తేగలిగారు. కేసీఆర్ బయటకు వచ్చి గొంతు విప్పిన తర్వాతే ప్రభుత్వం నుంచి ఎంతో కొంత స్పందన మొదలైంది. అది రైతుబంధు ఇవ్వడమైనా, రుణమాఫీ డేట్ రావడమైనా, పంటలకు పరిహారమైనా, ఓయూ హాస్టళ్లు తెరవడమైనా, నేత కార్మికుల బకాయిలు విడుదల చేయడమైనా! కేసీఆర్ లేకుంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తమను మళ్లీ గాలికొదిలేస్తుందనే విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైంది. అందుకే అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించటం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ప్రెషర్‌గ్రూప్‌ను తయారు చేయాలని ఓటర్లు నిర్ణయించుకున్నట్టే కనిపిస్తున్నది' అని గత 40 ఏండ్లుగా తెలంగాణ రాజకీయాలను దగ్గరగా పరిశీలిస్తున్న సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు అన్నది ఉత్త మాట. ఇప్పుడు కాంగ్రెస్ అయినా, బీజేపీ అయినా హైదరాబాద్ మినహా అన్ని సీట్లలో బీఆర్ఎస్‌తోనే పోటీ పడనున్నాయి. బీఆర్ఎస్‌కు ఉన్న స్థానికత, తెలంగాణపై ఉన్న కన్సర్న్, కేసీఆర్‌కు ఉన్న ప్రజాదరణ వల్ల కాంగ్రెస్, బీజేపీలు రెండో స్థానం కోసమే కొట్లాడకతప్పదు' అని ఆయన అభిప్రాయపడ్డారు.

500కే గ్యాస్.. కొందరికేనా!

వాస్తవ అర్హులు 90 లక్షల కుటుంబాలు
అర్హులుగా గుర్తించింది 39.33 లక్షల కుటుంబాలనే
ఇందులోనూ లబ్ధిపొందింది 18.86 లక్షల కుటుంబాలే

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఎన్నికల హామీ రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం నామ్ కే వాస్తే అన్నట్టుగా కొనసాగుతున్నది. రాష్ట్రంలో తెల్ల రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలు దాదాపు 90 లక్షల వరకు ఉన్నాయి. వీరిలో ఇప్పటి వరకు 39.33 లక్షల కుటుంబాలను మాత్రమే అర్హులుగా గుర్తించింది. కానీ ఏప్రిల్ 13వ తేదీ నాటికి కేవలం 18.86 లక్షల మందికి మాత్రమే రూ. 500 గ్యాస్ సిలిండర్‌ను అందించింది. దీనిబట్టి ఎంతో గొప్పగా చెప్పుకునే గ్యాస్ పథకం కొందరికే అందుతున్నట్టు అర్థమవుతున్నది.

ఆర్థిక భారం తప్పించుకునేందుకే..

వాస్తవానికి తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ రూ.500 గ్యాస్ పథకం వర్తించాలి. ఈ లెక్కన 90 లక్షల కుటుంబాలను అర్హులుగా గుర్తించాలి. కానీ ప్రభుత్వం 39.33 లక్షల మందినే అర్హులుగా గుర్తించింది. వాస్తవ అర్హుల్లో సగానికిపైగా కోత పెట్టింది. అంతేగాక.. అర్హులుగా గుర్తించిన వారిలోనూ సగం మందికి కూడా ఈ పథకం అందలేదు. దీంతో లబ్ధిదారులు తమకు పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. స్పందించిన అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. మళ్లీ దరఖాస్తు చేసినా ప్రయోజనం ఉండటం లేదు. దీంతో ఏం చెప్పాలో దిక్కుతోచని ప్రభుత్వం.. ప్రస్తుతం తొలి దశలో కొందరికే సబ్సిడీ గ్యాస్ అందుతున్నదని, అర్హులందరికీ పథకాన్ని వర్తింపజేస్తామని చెప్తున్నది. కానీ ఈ మాటల వెనుక మతలబు వేరని, ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకే కొందరికే పథక